లక్ష్మీనర్సింహస్వామి సన్నిధిలో మాజీ ఎంపీ

ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 23: మండలకేంద్రంలోని స్వయంభూ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం ప్రథమ వార్షిక బ్రహోత్సవాలు సోమవారం ప్రారంభంకాగా, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నేత గూడూరి ప్రవీణ్ హాజరై పూజలు చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, మాజీ సర్పంచ్ అంకారపు రవీందర్, రాపెల్లి ఆనందం, మచ్చ శ్రీనివాస్,క్యారం జగత్, మాజీ సర్పంచ్‌లు అంకారపు అనిత, కోడం సంధ్యరాణి, దొర్నాల జయరాంరెడ్డి, హనుమంతరెడ్డి, మోర రాజు, దేవయ్య, బండి జగన్, అనిల్, అంజనేయులు ఉన్నారు.

డిమాండ్లు నెరవేర్చేదాకా వెనక్కి తగ్గేది లేదు

- 14వ రోజుకు ఎస్ఎస్ఏ ఉద్యోగుల దీక్ష

నల్ల దుస్తులతో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

కలెక్టరేట్, డిసెంబర్ 23: తమ న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చేదాక వెనక్కి తగ్గేదిలేదని ఎస్ఎస్ఏ ఉద్యోగులు స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు 14వ రోజుకు చేరగా, సోమవారం నల్ల దుస్తులతో మోకాళ్లపై కూర్చొని సమగ్ర శిక్ష ఉద్యోగుల తమ నిరసన తెలిపారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ముస్తాబాద్ డీటీఎఫ్ మండల బాధ్యులు బాదవేణి అంజయ్య వీరి దీక్షకు సంఘీభావం తెలిపి, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. ఇక్కడ సమగ్ర శిక్షా అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్లి వస్తూ

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- రాగట్లపల్లి శివారులో ఘటన

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 23: శుభకార్యానికి వెళ్లి తిరిగివస్తూ ఓ యువకుడు మృతిచెందిన ఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన సబ్బని జగన్(35) నారాయణపూర్‌లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వస్తున్నాడు. రాగట్లపల్లి శివారుకు చేరుకోగానే, వెనుక వైపు నుంచి ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. జగన్‌కు భార్య దివ్య, కూతురు దేవాన్షిక(3) ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. జగన్ మృతితో గ్రామంలో విషాదం నెలకొన్నది.

'కేసీఆర్ కుట్టుమిషన్ల' లబ్ధిదారుల జాబితా రద్దు

- ప్రభుత్వం మారడంతో నిలిపివేత
- మిషన్లపై కేసీఆర్ ఫొటో స్టిక్కర్ ఉండడమే కారణం
- గతంలో ఎంపికైన మహిళల్లో అయోమయం
- ఇటీవల కొత్తగా 800 దరఖాస్తుల స్వీకారం

పంపిణీ కోసం ఉంచిన కుట్టుమిషన్లు

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 23: పేద ముస్లిం మహిళల ఆర్థిక సాధికారత కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కింద సిరిసిల్ల నియోజక వర్గానికి సుమారు రూ.40 లక్షల వ్యయంతో 405 కుట్టు మిషన్లను మంజూరు చేసింది. అయితే, అప్పటి లబ్ధిదారుల జాబితాను రద్దు చేసి, కొత్తగా మళ్లీ అర్జీ పెట్టుకోవాలని అధికారులు చెబుతుండడంతో ముస్లిం మహిళల్లో అయోమయం నెలకొన్నది. ప్రభుత్వం మారడం మిషన్లపై కేసీఆర్ చిత్రపటంతో ఉన్న స్టిక్కర్లు తొలగించకపోవడంతో పంపిణీ ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేసింది. గతేడాది అక్టోబర్ 10న సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయంలో అప్పటి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ 10 మంది లబ్ధిదారులకు మిషన్లు పంపిణీ చేయగా, మిగతావి అధికారుల చేతుల మీదుగా పంపిణీ చేయాలని భావించారు. కానీ, ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ ప్రక్రియ నిలిచిపోగా, ఎలక్షన్లు ముగిసిన తర్వాత ఇస్తారని లబ్ధిదారులు ఆశించారు. అయితే ప్రభుత్వం మారడంతో సర్కారు పెద్దలు లబ్ధిదారుల జాబితాను రద్దు చేశారు. బీఆర్ఎస్ సర్కారు మంజూరు చేసిన కుట్టు మిషన్లను తమ ప్రభుత్వం మంజూరు చేసినట్లుగా కొత్త అర్జీలను తీసుకుంటుండగా, తమకు మిషన్లు వస్తాయో..? రావోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై మైనార్టీ కార్పొరేషన్ అధికారి సర్వర్ పాషాను వివరణ కోరగా, పాత లబ్ధిదారుల జాబితాను రద్దు చేశామని, అందరూ మళ్లీ కొత్తగా అర్జీ పెట్టుకోవాలని 405 కుట్టు మిషన్లకు గాను ఇప్పటికే ఆన్‌లైన్‌లో 800 అర్జీలు వచ్చాయని తెలిపారు.

'గ్రీవెన్స్ డే'తో సత్వర న్యాయం

- ఎస్పీ అఖిల్ మహాజన్
- 23 ఫిర్యాదుల స్వీకరణ

తెలంగాణ చౌక్, డిసెంబర్ 23: వివిధ రకాల ఇబ్బందులతో బాధపడేవారికి సత్వర న్యాయం చేసేందుకే ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్జీదారుల నుంచి 23 ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. భూమి, ఆస్తి తగాదాల విషయంలో చట్టప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. ఫ్రెండ్లీ ఫోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తామని వివరించారు.

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ప్రజల శ్రేయస్సే పోలీసుల లక్ష్యం

గంభీరావుపేట, డిసెంబర్ 23: గ్రామీణ ప్రాంత ప్రజల శ్రేయస్సే తమ లక్ష్యమని, 'కమ్యూనిటీ పోలీస్' కార్యక్రమంలో భాగంగా ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. లింగన్నపేట ఎర్ర షెలక తండాలో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని వైద్య బృందంతో కలిసి ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతాల్లో ఉండే పేద ప్రజలకు సత్వర ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా గ్రామాల్లో నిపుణులైన వైద్య బృందంతో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. కాగా, మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఇక్కడ డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ శ్రీకాంత్, వైద్య నిపుణులు, తండా వాసులు ఉన్నారు.

కృష్ణవేణి స్కూల్‌లో క్రిస్మస్ సంబురాలు

వేములవాడ టౌన్, డిసెంబర్ 23: పట్టణంలోని కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ (సరస్వతీ బ్లాక్)లో ముందస్తు క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఏసుక్రీస్తు, శాంతాక్లాస్, వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సన్నిధి వెంకటకృష్ణ,స్కూల్ ఉపాధ్యాయబృందం ,విద్యార్థులు పాల్గొన్నారు

విద్యార్థినికి అభినందన

విద్యార్థిని ఫాతిమాతో డీఈవో రాము

జగిత్యాల టవర్ సర్కిల్, డిసెంబర్ 23: రాష్ట్రస్థాయి జాతీయ గణితం టాలెంట్ పరీక్షలో ప్రతిభ చూపిన ఖాజీపురా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని సఫూర ఫాతిమాను సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో కే రాము అభినందించారు. అలాగే ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎంఏ రహీమ్, సమీయొద్దీన్, డాటి శ్రీనివాస్, ఖతీబ్ ఫాయిమ్, రాజ్‌కుమార్, అజీజ్, సిబ్బంది కూడా డీఈవో అభినందనలు తెలిపారు.